సాక్షి
నల్లగొండ
గురువారం, 1, జూన్, 2023



నకిలీ పత్తి విత్తన విక్రేతల అరెస్ట్
నకిలీ పత్తివిత్తనాలు అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను నల్లగొండ ఎస్పీ వెల్లడించారు. - 8లో



ధాన్యం కొనుగోలు చేయాలని..
ధాన్యం కొనాలని డిమాండ్ చేస్తూ కౌలు రైతు గుండాల తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ఆత్మహత్యకు యత్నించాడు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
42°/27°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

బధిరుల స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : మిర్యాలగూడ సమీపంలోని అవంతీపురం ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 1 నుంచి 6వ తరగతి వరకు(తెలుగు, ఇంగ్లీష్ మీడియం), 7 నుంచి 10వ తరగతి వరకు (తెలుగు మీడియంలో)ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీతారామరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో బాల, బాలికలకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. 8 నుంచి 14 సంవత్సరాల వయస్సు ఉండి వినికిడి లోపం ఉన్న బాల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఐసీడీఎస్ కార్యాలయానికి తాళం



కార్యాలయానికి తాళం వేసిన యజమాని

చింతపల్లి : మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయ అద్దె భవనానికి యజమాని వసంత బుధవారం తాళం వేశారు. భవనానికి 15 నెలలుగా చెల్లించకపోవడంతో తాళం వేసినట్లు ఆమె పేర్కొన్నారు. నెలకు రూ.5,500 చొప్పున రూ.82,500 అద్దె చెల్లించాల్సి ఉందని.. అద్దె చెల్లించాలని పలుమార్లు అధికారులను అడిగినా స్పందించ లేదని ఆమె తెలిపారు.

బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

మర్రిగూడ : బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లలో అగ్రవర్ణాలకు 7.5 శాతం ఉంటే పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. జనాభా లెక్కల ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతున్నామని చెప్పారు. సమావేశంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు చెరుకు శ్రీరాములు, వెంకటంపేట బాలయ్య, పగడాల లింగయ్య, పందుల యాదయ్య, లింగస్వామి, ముత్యాలు, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూ విద్యార్థికి వెండి పతకం



వెండి పతకం సాధించిన విద్యార్థి

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడాపోటీల్లో మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థి రామినేని శివలింగేశ్వరసాయి వెయిట్ లిఫింగ్‌లో 260 కేజీలు ఎత్తి వెండి పతకం సాధించాడు. గతంలో జరిగిన అంతర్ యూనివర్సిటీ పోటీల్లో సాయి ప్రతిభ కనబర్చి ఖేలో ఇండియా పోటీల్లో యూనివర్సిటీ తరుపున పాల్గొన్నాడు. సాయి వెండి పతకం సాధించడంపై యూనివిర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణారావు, క్రీడల డైరెక్టర్లు ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

వన్య ప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

చందంపేట : వేసవి దృష్ట్యా వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లోని పాలపేడ, రేకుల వలయం అటవీ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణులను వేటాడినా, అక్రమంగా కలపను తరలించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అటవీ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎఫ్ఆర్ఓ సుమన్, సెక్షన్ ఆఫీసర్ శ్రీదేవి, బీట్ ఆఫీసర్లు తదితరులున్నారు.

వాలీబాల్ విజేత నల్లగొండ



వాలీబాల్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ తదితరులు

నిడమనూరు : సీఎం కప్ -2023 వాలీబాల్ (మహిళ) విజేతగా నల్లగొండ జట్టు నిలిచింది. తెలంగాణ అవతరణ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28 నుంచి 31 వరకు సరూర్‌నగర్ స్టేడియంలో రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో 33 జిల్లాల నుంచి జట్లు పోటీ పడ్డాయి. బుధవారం జరిగిన వాలీబాల్ ఫైనల్‌లో నల్లగొండ జట్టు మహబూబాబాద్‌పై విజయం సాధించింది. విజేతలకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచిన నల్లగొండ వాలీబాల్(మహిళ) జట్టుకు మెమెంటోతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి దక్కింది. నల్లగొండ జిల్లా జట్టులో నిడమనూరు మండలం ముకుందాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు నలుగురు ఉండడం గమనార్హం.

బదిలీలపై సందిగ్ధత

- ఎనిమిదేళ్లుగా పదోన్నతి కోసం ఉపాధ్యాయుల ఎదురుచూపు
- ఇటీవల పదోన్నతులు, బదిలీల కోసం దరఖాస్తుల స్వీకరణ
- స్పౌజ్ విషయంలో కోర్టును ఆశ్రయించిన పలువురు టీచర్లు
- ఈ నెల 13న కోర్టులో విచారణ.. తీర్పు ఆధారంగానే ప్రక్రియ



నల్లగొండ : ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులపై సందిగ్ధత వీడలేదు. ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇవ్వకపోవడంతో ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. బదిలీలు, పదోన్నతుల విషయంలో ఉద్యోగులకో తీరు.. ఉపాధ్యాయులకు మరో తీరులా ఉంది. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చి పాఠశాలలు ప్రారంభం కాక ముందే బదిలీల ప్రక్రియను ప్రారంభించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పదోన్నతికి నోచుకోకుండానే ఉద్యోగ విరమణ
నల్లగొండ జిల్లాలో అన్ని కేటగిరిలో పరిధిలో 1,483 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలో 1300 పైచికు మందికి ప్రమోషన్లు వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొమ్మిదేళ్ల కాలంలో 2015లో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. 2018లో బదిలీలు చేపట్టింది. ఆ తరువాత బదిలీలు, పదోన్నతులు చేపట్టలేదు. దీంతో అన్ని అర్హతలు ఉన్నా.. పదోన్నతికి నోచుకోకుండానే కొందరు ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసింది. ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. బదిలీల్లో స్పౌజ్ కేసులు ఉన్నవారికి పాయింట్లు ఎక్కువ ఇవ్వడంతో.. నాన్ స్పౌజ్ వారు తమకు అన్యాయం జరుగుతుందని కోర్టును ఆశ్రయించడంతో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది. ఇక, మోడల్ స్కూళ్లలో కూడా ప్రారంభం నాటి నుంచి వారికి పదోన్నతులు, బదిలీలు చేపట్టలేదు. ప్రస్తుతం కేజీబీవీల్లో మాత్రమే బదిలీల ప్రక్రియ చేపట్టారు.

కోర్టు తీర్పు ఆధారంగానే..
ఉపాధ్యాయులు బదిలీలకు సంబంధించి కోర్టులో ఈ నెల 13న విచారణ ఉంది. కోర్టు తీర్పు ఆధారంగానే ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది. తీర్పు ఆలస్యమైతే ఇప్పట్లో బదిలీలు, పదోన్నతులు ఉండనట్లే అని తెలుస్తోంది. ప్రభుత్వం ఈ విషయంలో నిర్ణయం తీసుకోకపోతే ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున బదిలీలు, పదోన్నతుల కోసం ఏడాది పాటు వేచి ఉండాల్సి వస్తుందని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు.

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని కోర్టు కేసును వెకెట్ చేయించాలి. పదోన్నతులు కల్పించి విద్యారంగాన్ని రక్షించాల్సిన అవసరం ఉంది. ఎంఈఓలు అంతా ఇన్‌చార్జిలే ఉన్నారు. సబ్జెక్టు టీచర్లు లేరు. పదోన్నతులు చేపట్టడం వల్ల అందరికీ మేలు జరుగుతుంది.
– పెరుమళ్ల వెంకటేశం, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కనీసం పదోన్నతులు కల్పించాలి



ఈ నెల 13న కోర్టులో కేసు విచారణ ఉంది. ఆరోజు తీర్పు అనుకూలంగా వస్తే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి. ఒకవేళ కేసు విచారణ వాయిదా పడితే కనీసం పదోన్నతులు చేపట్టాలి. చాలా మంది ఉపాధ్యాయులు అర్హత ఉండి కూడా పదోన్నతులు పొందకుండానే ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో నిర్ణయం తీసుకుని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.
– కాలం నారాయణరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

అవతరణ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎస్పీ తదితరులు

- అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి
- జిల్లా నోడల్ అధికారి సుదర్శన్‌రెడ్డి

నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా నోడల్ అధికారి, పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. అవతరణ ఉత్సవాల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఎస్పీ అపూర్వరావుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో జూన్2 నుంచి 22వ తేదీ వరకు చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. శాఖల వారీగా చేపట్టబోయే కార్యక్రమాలపై స్పష్టత ఉండాలని అధికారులందరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం అవతరణ తర్వాత ప్రతి శాఖ జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయాలు, ప్రగతిని గతంతో పోల్చుతూ నాడు - నేడు పేరిట ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని, కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలని సూచించారు. వివిధ శాఖల్లో ఉత్తమ ఉద్యోగులను సన్మానించాలన్నారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు నిర్వహించే ఉత్సవాలపై సంబంధిత శాఖలు సూక్ష్మ ప్రణాళికతో సన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, డీఎఫ్ఓ రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

మఠంపల్లి: మఠంపల్లిలోని మాన్‌ఫోర్ట్ పాఠశాల ఆవరణలో రెండు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల రగ్బీ పోటీలను బుధవారం స్థానిక సెయింటాన్స్ పాఠశాల సుపీరియర్ సిస్టర్స్ బాలసుందరి, రూబీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 15జిల్లాల నుంచి 250మంది బాలబాలికలు పాల్గొన్నారని తెలిపారు. మొదటిరోజు జరిగిన పోటీల్లో సూర్యాపేట, నల్లగొండ, వరంగల్, హైదరాబాద్ బాలికల జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. పోటీలు గురువారం ముగుస్తాయని వెల్లడించారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి



ఇంద్రారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : అమరవీరుల స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని తడకమళ్ల గ్రామంలో దివంగత సీపీఎం నాయకుడు గొర్ల ఇంద్రారెడ్డి విగ్రహావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. గొర్ల ఇంద్రారెడ్డి విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐ కార్యకర్తగా పనిచేసి కమ్యూనిస్టు నాయకుడిగా జీవితాంతం ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నమ్మిన పార్టీని వదలకుండా పేదల పక్షాన పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, మంగారెడ్డి, పరశురాములు, వరలక్ష్మి, నాగేష్, శ్రీను, వెంకటయ్య, గుంటి శ్రీను, సుధాకర్, పాదూరి గోవర్ధన, సైదులు, పుల్లయ్య, రమేష్‌బాబు, గోవిందరెడ్డి తదితరులున్నారు.

నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట

- పత్తి విత్తనాల ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించాలని కంపెనీలకు ప్రభుత్వం ఆదేశం
- ప్రస్తుత వానాకాలం నుంచే అమలు
- రైతులకు ప్రయోజనం



పత్తి విత్తనాల ప్యాకెట్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్

నల్లగొండ అగ్రికల్చర్ : నకిలీ పత్తి విత్తనాలకు ప్రభుత్వం చెక్ పెడుతోంది. పత్తి విత్తనాల ప్యాకెట్‌పై క్యూఆర్(క్విక్ రెస్పాన్స్) కోడ్ ముద్రించాలని పత్తి విత్తన కంపెనీలను ఆదేశించింది. వానాకాలం సీజన్ నుంచే తప్పని సరిగా క్యూఆర్ కోడ్ ముద్రించిన పత్తి విత్తన ప్యాకెట్‌లను విక్రయించాలని ఆయా విత్తన కంపెనీలను ఆదేశించింది. ఇప్పటికే కొన్ని కంపెనీలు క్యూఆర్‌కోడ్‌ను ముద్రించిన పత్తి విత్తన ప్యాకెట్‌లను మార్కెట్‌లోకి తీసుకొచ్చాయి. క్యూఆర్ కోడ్ ముద్రించడం వల్ల నాణ్యమైన విత్తనాలు రైతులకు అందనున్నాయి. క్యూర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విత్తనాల పూర్తి సమాచారం రైతులకు సులువుగా తెలిసిపోతుంది.

టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు..
ప్రతి సీజన్‌లో నకిలీ పత్తి విత్తనాలు రైతులను నిలువునా ముంచుతున్నాయి. వేలాది రూపాయలు వెచ్చించి బ్రాండెడ్ కంపెనీల పత్తి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే పూత, కాత లేక రైతులు నష్టపోతున్నారు. అయితే నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు ఇప్పటికే జిల్లా యంత్రాంగం జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి తనిఖీలను నిర్వహిస్తోంది. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నకిలీ విత్తనాల అమ్మకం గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నట్లు సమాచారం. కొందరు గ్రామాల్లోని ఎరువులు, విత్తనాలను ఉద్దెర రూపంలో రైతులకు ఇస్తుండడంతో.. పెట్టుబడికి డబ్బులు లేని రైతులు వ్యాపారులు ఇచ్చిన విత్తనాలు తీసుకుని మోసపోతున్నారు.

క్యూఆర్ కోడ్ ఉన్న ప్యాకెట్లు కొనాలి



రైతులు విధిగా పత్తి విత్తన ప్యాకెట్‌లపై కూఆర్ కోడ్ ఉన్నది లేనిది చూసి క్యూఆర్ కోడ్ ఉన్న ప్యాకెట్‌నే కొనాలి. తీసుకున్న విత్తనాలకు సరైన బిల్లులు తీసుకోవాలి. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను ముద్రించాలని ఆదేశించింది. దీనివల్ల రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు అందుతాయి.
– వై.సుచరిత, డీఏఓ

క్యూఆర్ కోడ్ వల్ల ప్రయోజనం..
రైతులు పత్తి విత్తన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి రశీదు పొందినప్పటికీ ఆ విత్తనాలు మొలకెత్తకపోయినా, ఇతర విధంగా నష్టపోయినా గతంలో విత్తన కంపెనీల నుంచి సరైన నష్టపరిహారం అందేది కాదు. కొందరు బ్రాండెడ్ కంపెనీల లేబుళ్లు అతికించి రైతులను మోసం చేసేవారు. కానీ ప్రస్తుతం క్యూఆర్ కోడ్ ముద్రించడంతో ఆ విత్తనాలు మొలకెత్తకున్నా, దిగుబడి సక్రమంగా రాకున్నా ఆ విత్తన కంపనీ నుంచి పరిహారం పొందవచ్చు. వ్యవసాయ అధికారులకు క్యూఆర్ కోడ్ ఉన్న ప్యాకెట్‌ను చూపిస్తే విత్తనం సమగ్ర సమాచారం వస్తుంది. దాని ఆధారంగా కంపెనీ నుంచి పరిహారం అందుతుంది. అయితే రైతులు కొనుగోలు చేసిన పత్తి విత్తనాల ప్యాకెట్‌ను, రశీదులను భద్రపర్చుకోవాలి.

మున్సిపల్ ఆస్తులు కాపాడుకుందాం..

- నీలగిరి మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ఏకాభిప్రాయం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సైదిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని మున్సిపల్ ఆస్తులు కాపాడుకుందామని అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిల్ సభ్యులందరూ ఏకాభిప్రాయం వెలిబుచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ప్రకాశం బజార్‌లోని మున్సిపల్ మడిగల కేటాయింపు విషయమై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ మడిగలను వేలం ద్వారా కేటాయిస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ.10 వేలు తీసుకున్నారని వారికి ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బహిరంగ మార్కెట్‌లో గజం ధర రూ.2 లక్షలకు పైగా ఉండగా రూ.3 వేల నుంచి రూ.30 వేల మధ్య ధర నిర్ణయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మడిగెల్లో వ్యాపారం చేసుకునే వారు లక్షాధికారులని వారికి షాపులను కేటాయిస్తే ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేసినట్లు అవుతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ మాట్లాడుతూ ఈఈఎస్ఎల్ సంస్థ నిర్వాహకులు ప్రైవేట్ వెంచర్లలో మున్సిపల్ ఎల్ఈడీ లైట్లను అమర్చారని దీనిపై సమగ్ర విచారణ జరిపి రికవరీ చేసి సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 22వ తేదీ వరకు జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో అందరూ పాల్గొనాలని కోరారు. వచ్చే నెలలో మంత్రి కేటీఆర్ నల్లగొండ పర్యటన ఉంటుందని తెలిపారు. కేటీఆర్ చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమణాచారి, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ కలీమ్, ఈఈ రాములు, డీఈలు వెంకన్న, అశోక్, ఏసీపీ నాగిరెడ్డి, రెవెన్యూ అధికారి ఖాజా ఆరిఫొద్దీన్, మేనేజర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట: ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం లక్ష పుష్పార్చన వేడుకలను పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి లక్ష పుష్పార్చన పూజలు చేశారు. తులసీ దళాలతో శ్రీస్వామి అమ్మవార్లను విశేషంగా పూజించారు. ఇక ఆలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు విశేషంగా జరిపించారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, గజవాహన సేవ, బ్రహ్మోత్సవం, వెండి జోడు సేవలను వైభవంగా నిర్వహించారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్య ఆదాయం రూ.24,74,736 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

డిండి ఖాళీ అవుతోంది



అడుగంటుతున్న డిండి ప్రాజెక్టు

- తూములకు కొత్త తలుపుల ఏర్పాటు కోసం నీటిని దిగువకు వదులుతున్న అధికారులు
- మళ్లీ వర్షాలు కురిసి ప్రాజెక్టు నిండితేనే సాగుకు నీరు

డిండి : నల్లగొండ-నాగర్‌కర్నూల్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న డిండి ప్రాజెక్టు ఎండిపోతోంది. ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసే తూములు తలుపులు తుప్పు పట్టి నీరు లీకేజీ అవుతోంది. దీంతో రూ.16 లక్షలతో కొత్త తలుపులు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకుగాను ప్రాజెక్టు నుంచి నీటిని కిందికి వదులుతున్నారు. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 2.4 టీఎంసీలుకాగా ప్రస్తుతం 0.3 టీఎంసీలకు చేరింది. ఈనెల రెండవ వారంలో తూములకు నూతన తలుపుల ఏర్పాటు చేసే పనులు ప్రారంభమై చివరి వారం వరకు పూర్తవుతాయని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

మళ్లీ ప్రాజెక్టు నిండితేనే..
ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షంతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు రావడంతో డిండి ప్రాజెక్టు ఆరు సంవత్సరాలుగా పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తూ కళకళలాడింది. ప్రాజెక్టు ఆయకట్టులో పంటల సాగుకు అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో మండలంలో సమృద్ధిగా పంటలు పండి కొంతమేర కరువు దూరమైంది. వలస వెళ్లకుండా రైతులు స్థానికంగానే వ్యవసాయం చేస్తూ జీవనం గడిపారు. ప్రాజెక్టు తలుపుల మరమ్మతు కోసం ప్రాజెక్టులోని నీటిని పూర్తిగా ఖాళీ చేస్తుండడంతో ప్రాజెక్టు అడుగంటుతోంది. మరమ్మతు పనులు ముగిసిన అనంతరం వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టులోకి నీరు వస్తేనే ఆయకట్టు కింద సాగు నీరు విడుదల చేస్తారని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. చేపల వేటే జీవనాధారంగా చేసుకొని బతుకుతున్న మత్స్యకారులు కూడా ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిగా ఖాళీ అవుతుండడంతో బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వలస వెళ్లక తప్పడం లేదు
డిండి ప్రాజెక్టు నుంచి నీటిని కిందకు వదలుతుండడంతో ప్రాజెక్టు పూర్తిగా అడుగంటుతోంది. దీంతో చేపల వేటనే నమ్ముకొని బతుకుతున్న నాలాంటి మత్స్యకారులకు పనిలేక కుటుంబాన్ని పోషించటం కష్టంగా మారుతుంది. తప్పని పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి బతకాల్సి వస్తోంది.
– తవటి సైదులు, మత్స్యకారుడు డిండి

ఈ నెలాఖరుకు పనులు పూర్తవుతాయి
ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిండి ప్రాజెక్టు నుంచి కిందకు నీటిని వదులుతున్నాం. మరో పదిరోజుల్లో ప్రాజెక్టులో నీరు పూర్తిగా వెళ్లిపోతుంది. తూముల మరమ్మతు పనులు ఈ నెల రెండవ వారంలో ప్రారంభమై నెలాకరు కల్లా పూర్తవుతాయి.
– శ్రీనివాసులు, ఇరిగేషన్ డీఈ, డిండి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె, దూడ మృతి

చౌటుప్పల్‌ : మండల పరిధిలోని జైకేసారం గ్రామానికి చెందిన సమిరెడ్డి రాంరెడ్డి రైతుకు చెందిన గేదె, దూడ బుధవారం జరిగిన విద్యుదాఘాతంతో మృతిచెందాయి. తన వ్యవసా బావి వద్ద విద్యుత్‌ వైరుకు తగలడంతో గేదె, దూడ అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారుగా లక్ష రూపాయల వరకు నష్టం జరిగినట్లు రైతు వాపోయాడు.

యువతి, యువకుడు అదృశ్యం

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన ఓ యువతి, యువకుడు అదృశ్యమయ్యారు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నీర్నెముల గ్రామానికి చెందిన నోముల పల్లవి నార్కట్‌పల్లిలోని నర్సింగ్‌ కళాశాలలో ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తోంది. ఈ నెల 30న కళాశాలకు వెళ్తున్నాననీ చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆమె కోసం బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి నోముల శంకరయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఇదే గ్రామానికి చెందిన చిప్పలపల్లి వెంకటేష్‌ ఈనెల 30న ఉదయం 10 గంటల సమయంలో పని మీద వెళ్తున్నాని భార్యతో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఇద్దరి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి


దిలీప్‌ (ఫైల్‌)

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన జూలూరి గంగాచారి, నాగమణి దంపతుల కుమారుడు జూలూరి దిలీప్‌ (25) ఇటీవల వడదెబ్బకు గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఉదయం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌ తరలించారు. అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పిడుగుపాటుతో ఎద్దు మృతి


మరిపడిగలో ఎద్దు కళేబరం

గుండాల : పిడుగుపాటుకు గురై ఎద్దు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని మరిపడిగ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కొండబోయిన మంకయ్యకు చెందిన కాడెద్దులను వ్యవసాయ బావి వద్ద మేపుతున్నాడు. ఈ క్రమంలో పిడుగు పడటంతో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. సుమారుగా రూ.60 వేల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

ప్రైవేట్‌ ఆస్పత్రుల నకి‘లీలలు’ !

- నకిలీ బిల్లులతో సీఎం సహాయ నిధి స్వాహా
- మిర్యాలగూడ కేంద్రంగా సాగుతున్న దందా
- గతంలో మహేష్‌ ఆస్పత్రిలో రూ.455కోట్ల కుంభకోణం
- తాజాగా నవీన ఆస్పత్రి నుంచి 21నకిలీ బిల్లుల గుర్తింపు
- వాస్తవాలు నిగ్గుతేల్చేందుకు సీఐడీ అధికారుల సమగ్ర దర్యాప్తు

మిర్యాలగూడ అర్బన్‌ : మిర్యాలగూడలోని కొని ప్రైవేట్‌ ఆస్పత్రులు నయా దందాకు తెరలేపాయి. రోగులకు వైద్య పరీక్షలు చేయకున్నా నకిలీ బిల్లులు సృష్టించి సీఎం సహాయ నిధిని స్వాహా చేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నాయి. గత ఏప్రిల్‌ నెలలో మిర్యాలగూడ పట్టణానికి చెందిన మహేష్‌ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో రూ.4.55 కోట్ల కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. దీంతో మిర్యాలగూడ ప్రాంతం నుంచి వచ్చే ప్రతి బిల్లును సంబధిత రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా నవీన మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు జారీ చేసిన నకిలీ బిల్లులను గుర్తించిన ప్రభుత్వం సీఐడీ అధికారులను రంగంలోకి దింపినట్లు తెలిసింది. దీంతో వారు వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు నకిలీ బిల్లుల వ్యహారంపై విచారణ చేపట్టినట్లు తెలిసింది.

కొరవడిన అధికారుల నిఘా

ఆస్పత్రుల నిర్వాహకులు నకిలీ బిల్లులు తయారు చేసి వాటిపై వైద్యుల సంతకాలు ఫోర్జరీ చేసి నిధులు కాజేస్తున్నారు. ఈ తరహా వ్యవహారం గతంలోనే వెలుగులోకి వచ్చినప్పటికీ జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు యథేచ్ఛగా నకిలీ బిల్లులు తయారు చేసి ఏకంగా ముఖ్యమంత్రి సహాయ నిధులపై కన్నేసి కాజేస్తున్నారు. కాగా, గతంలో సీఎంఆర్‌ఎఫ్‌ నిధులు కాజేసిన మహేష్‌ ఆస్పత్రి నిర్వాహకులు ఏపీ రాష్ట్ర గుంటూరు మెడికల్‌ కళాశాల ప్రొఫెసర్‌ డాక్టర్‌ కిరణ్‌కుమార్‌ సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ బిల్లులు కాజేశారు. దీంతో సదరు వైద్యుడు ఆస్పత్రి నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మహేష్‌ ఆస్పత్రి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. తాజాగా నవీన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు సైతం వైద్యుల సంతకాలు ఫోర్జరీ చేసినట్లు సీఐడీ అధికారులు అనుమానిస్తున్నారు. వైద్యధికారుల నిఘా లేకపోవడంతోనే ప్రైవేట్‌ ఆస్పత్రుల మెడికల్‌ దందాకు ఊతమిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కొందరు వైద్యులు ప్రైవేట్‌ ఆస్పత్రులకు సహకరిస్తూ నకిలీ బిల్లులో వచ్చే డబ్బుల్లో పర్సెంటీజీలు పొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వైద్యుల పాత్రపై అనుమానాలు

మిర్యాలగూడ డివిజన్‌ పరిధిలోని నాగార్జునసాగర్‌, మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు కొందరు కొంత కాలంగా నవీన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో విజిటింగ్‌ డాక్టర్లుగా పని చేస్తున్నారు. అయితే ఈ ఆస్పత్రిలో 21 మంది రోగులకు ఖరీదైన వైద్యం చేసినట్లుగా లక్షల్లో బిల్లులను ఇచ్చారు. ఈ బిల్లులపై ఓ డాక్టర్‌ నాలుగు బిల్లులపై, మరో డాక్టర్‌ 17 బిల్లులపై సంతకాలు చేశారు. ఈ ఆస్పత్రిలో అత్యంత ఖరీదైన వైద్యం అందించే సదుపాయాలు లేకున్నా లక్షల్లో బిల్లులు ఇవ్వడంపై సీఐడీ అధికారులు తప్పు బట్టినట్లు సమాచారం. దీంతో ఆస్పత్రి నిర్వాహకులు జారీ చేసిన బిల్లులు సుమారు కోటి రూపాయలకు పైగా ఉండడంతో సమగ్ర విచారణ చేపట్టారు. దీంతో ఆస్పత్రిలో విజిటింగ్‌ డాక్టర్లుగా పని చేస్తున్న వైద్యుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా నకిలీ బిల్లులు జారీ చేసిన నవీన మల్టీ స్పెషాలిటీ లో వైద్యులను ఇప్పటికే విచారించిన సీఐడీ అధికారులు తాజాగా ఆస్పత్రి నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం.

కులవృత్తులకు జీవం పోసిన సీఎం కేసీఆర్‌

- మంత్రి జగదీశ్‌రెడ్డి


సూర్యాపేటలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మేదరి సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట): 2014 కు ముందు అచేతనంగా మారిన కుల వృత్తులకు సీఎం కేసీఆర్‌ జీవం పోశారని మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేటలోని క్యాంప్‌ కార్యాలయంలో ఆయనను సూర్యాపేట జిల్లా మేదర సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కులవృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్‌ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కుల వృత్తులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రమిస్తోందని, అందులో భాగంగానే వృత్తిదారులకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందించాలని నిర్ణయించిందని చెప్పారు. ఇప్పటికే మేదరులకు వెదురుతో గృహాలంకరణ వస్తువుల తయారీపై ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇప్పించిందన్నారు. కొద్ది మందికి రుణాలను కూడా మంజూరు చేసిందని, అదేరీతిన మిగతా కులవృత్తుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్‌ఎస్‌ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, మేదర సంఘం ప్రతినిధులు యాదగిరి, మల్లయ్య, తిరుపతయ్య, వెంకన్న, మల్లేశం, వెంకన్న తదితరులున్నారు.

విష ప్రయోగమా.. ఎండతీవ్రతా ?

- రైతు చెరువులో చేపలు మృతి

మోతె : వ్యవసాయ క్షేత్రంలో రైతు పెంచుతున్న చేపలు బుధవారం మృతిచెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామానికి చెందిన రైతు యల్లయ్య తన వ్యవసాయ క్షేత్రంలో సుమారుగా 1.30 కుంటల విస్తీర్ణం గల చెరువులో 8 నెలల క్రితం 20 వేల చేప పిల్లలను పోసి పెంచుతున్నాడు. చేపలు సుమారుగా 500 గ్రాముల నుంచి కేజీ సైజు వరకు ఉన్నాయి. ఉన్నట్లుండి బుధవారం ఉదయం ఒకేసారిగా చెర్వులో చేపలన్నీ మృత్యువాత పడ్డాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆక్సిజన్‌ అందక మృత్యువాత పడ్డాయా లేదా ఎవరైన విషప్రయోగం చేశారా అని రైతు అనుమానం వ్యక్తం చేశాడు. మృతిచెందిన చేపను పాలేరు ఫిషరీ ల్యాబ్‌కు పంపించారు.

ఇద్దరు నకిలీ పత్తి విత్తన విక్రేతల అరెస్ట్‌

- రూ.10లక్షల విలువైన విత్తనాలు స్వాధీనం


నకిలీ విత్తన ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. వారి నుంచి రూ. 10లక్షల విలువైన 10క్వింటాళ్ల 45 కేజీల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 444 ప్యాకెట్లు(2క్వింటాళ్లు) ఉన్నాయి. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అపూర్వరావు వెల్లడించారు. మునుగోడు పోలీసులు పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న సమయంలో బస్టాండ్‌ వద్ద నంద్యాల జిల్లా అల్లగడ్డ తాలూకాకు చెందిన కర్నాటి మధుసూదన్‌ రెడ్డి, తూర్పు గోదావరి జిల్లా తాళ్లూరు మండలం గండెపల్లి గ్రామానికి చెందిన గురిజాల వీరబాబు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీలు చేయగా విత్తన ప్యాకెట్లు ఉన్నాయి. వ్యవసాయ అధికారులతో విచారించగా నకిలీ విత్తన ప్యాకెట్లుగా గుర్తించారు. వెంటనే సమగ్రంగా విచారించగా కొంత కాలంగా నంద్యాల పరిసర ప్రాంతాల్లో రైతుల నుంచి తక్కువ ధరకు విత్తనాలు కొనుగోలు చేసి గుంటూరుకు తరలించి హరికృష్ణా రెడ్డికి చెందిన పాత మిల్లులో రంగులు,రసాయనాలు పూసి ఎలాంటి గుర్తింపు లేని సూర్యాసీడ్స్‌, మేఘనా, అరుణోదయ పేరిట మొత్తం 10 ప్యాకెట్లు తీసుకొని మునుగోడులో నేరుగా రైతులకు, విత్తన డీలర్లకు అమ్మేందుకు చూశారు. నేరస్తులు ఇచ్చిన సమాచారంతో హరికృష్ణా రెడ్డికి చెందిన పాత మిల్లునుంచి మిగిలిన పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నకిలీ విత్తనాలు నేరుగా రైతులు, విత్తన డీలర్లకు అమ్మేందుకు ప్రయత్నించిన కర్నాటి మధుసూదన్‌, గురిజాల వీరబాబులను అరెస్టు చేయగా హరికృష్ణారెడ్డి పరారీలో ఉన్నట్లు తెలిపారు. గతంలో మధుసూదన్‌ రెడ్డిపై పీడీయాక్టు నమోదు అయినట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ సతీష్‌రెడ్డి ఎస్పీ అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చౌటుప్పల్‌ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మల్కాపురం శివారులోని తుర్కగూడెం రోడ్డులో సుమారు 60-65ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని వెళ్లారు. పరిసరాలు పరిశీలించారు. భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఫిట్స్‌, లేదంటే ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయి ఉండొచ్చునని భావిస్తున్నారు. ఎస్‌ఐ సీతపాండు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

దేవరకొండ : అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతిచెందింది. ఈ ఘటన దేవరకొండ మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్‌ తెలిపిన ప్రకారం.. దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొర్రతండాకు చెందిన సేనావత్‌ మాన్‌సింగ్‌ దంపతుల చిన్న కుమార్తె చిన్ని(18) పదవ తరగతి పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. అదే తండాకు చెందిన విజయ్‌ కొంతకాలంగా ప్రేమపేరుతో యువతి వెంట పడుతున్నాడు. కాగా, ఇటీవల చిన్ని తల్లిదండ్రులు వివాహం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 29న ఇంటి నుంచి బయటికి వెళ్లిన చిన్ని తండా సమీపంలోని వ్యవసాయ బావిలో బుధవారం విగతజీవిగా కనిపించింది. గమనించిన పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్‌ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తన కుమార్తెమృతికి విజయ్‌ కారణమంటూ అనుమానం వ్యక్తం చేస్తూ యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు పట్టాల పక్కన వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఆలేరురూరల్‌ : రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆలేరులో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు రైల్వేస్టేషన్‌ ఎగువ మార్గంలో లూప్‌లైన్‌ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి రైల్వేపోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో భువనగిరి జీఆర్పీ హెడ్‌ కానిస్టేబుల్‌ ఎస్‌.సత్యనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, ఇతను సహజంగా లేదా వడదెబ్బకు గురై మృతిచెంది ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నామన్నారు. మృతుడు సుమారు 55 సంవత్సరాల వయసు ఉంటుందని లేత ఆకుపచ్చ టీషర్టు, పింక్‌ రంగు పొట్టి నిక్కర్‌ ధరించి ఉన్నాడని చెప్పారు. ఇతను మంగళ, బుధవారాల్లో స్థానిక రైల్వేస్టేషన్‌ ప్లాట్‌ఫారాలపై తిరిగిట్లు రైల్వే క్వార్టర్లలో భిక్షాటన చేసినట్లు తెలిసిందన్నారు. ఇతను బిహార్‌ లేదా ఒడిశాకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలని..

- తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట కౌలు రైతు ఆత్మహత్యాయత్నం


తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్‌ పోసుకుని మాట్లాడుతున్న ప్రవీణ్‌

గుండాల : వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్‌ చేస్తూ ఓ కౌలు రైతు తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గుండాలకు చెందిన అన్నెపర్తి ప్రవీణ్‌ గ్రామంలో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. కోసిన పంటను 20రోజుల క్రితం స్థానిక ఐకేపీ సెంటర్‌కు తరలించాడు. లారీల సాకు చూపి రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని ప్రవీణ్‌ మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో బుధవారం తహసీల్దార్‌ కార్యాలయం వద్దకు బాటిల్‌లో పెట్రోల్‌ తీసుకుని వచ్చి ఒంటిపై పోసుకున్నాడు. నిప్పు అంటించుకునేలోపే రెవెన్యూ సిబ్బంది గమనించి అడ్డుకున్నారు. విషయం తెలుసుకుని తహసీల్దార్‌ జ్యోతి కార్యాలయం నుంచి బయటికి వచ్చి ధాన్యాన్ని తూకం వేసి మిల్లుకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ప్రవీణ్‌ ఇంటికి వెళ్లిపోయాడు.

ఇంటి పైనుంచి పడి ఒకరి దుర్మరణం


బాలాజీ (ఫైల్‌)

కోదాడరూరల్‌ : ఇంటి పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని టీచర్స్‌ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టీచర్స్‌ కాలనీలో నివాసం ఉండే బదావత్‌ బాలాజీ(45)తన రెండంతస్తుల సొంతింటిపై మరమ్మతులు చేయిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలై మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య జయకుమారి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీత్లాతండాలో విషాదఛాయలు

చిలుకూరు: ఇంటి పైనుంచి పడి మృతిచెందిన బాలాజీ కాంగ్రెస్‌ పార్టీ చిలుకూరు మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఆయన మృతిచెందడంతో స్వగ్రామం చిలుకూరు మండలం సీత్లాతండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బాలాజీ మృతికి కాంగ్రెస్‌ పార్టీ నాయకులతో పాటు పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

నిలిచున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ప్రైవేట్‌ బస్సు

- ఇద్దరికి స్వల్ప గాయాలు

నార్కట్‌పల్లి : నిలిచున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ప్రైవేట్‌ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నార్కట్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో నార్కట్‌పల్లిలోని ఐఓసీ పెట్రోల్‌ బంక్‌ వద్దకు రాగానే బస్సు ఆగిపోయింది. దీంతో డ్రైవర్‌ మరమ్మతులు చేయించేందుకు రోడ్డు పక్కన నిలిపాడు. ఇదే మార్గంగుండా భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు 30మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్‌ బస్సు వెనుక నుంచి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రైవేట్‌ బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రైవేట్‌ బస్సులో పుష్ప-2 సినిమా ఆర్టిస్టులు కూడా ఉన్నారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

అంబేద్కర్‌ ఆశయ సాధనకు కృషిచేయాలి

- ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


అంబేద్కర్‌ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంద కృష్ణ మాదిగ

మునగాల(కోదాడ): భారత రాజ్యాంగ సృష్టికర్త డా.బాబాసాహెబ్‌ అంబేద్కర్‌ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. బుధవారం మండలంలోని గణపవరంలో ఏపీజేబీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రొ.ఖాసీం, భరత్‌భూషణ్‌, సూరేపల్లి సుజాతలతో కలసి ఆవిష్కరించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన విగ్రహాల నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన శ్రీగౌతమబుద్ధ, జ్యోతిబాపూలే, జగ్జీవన్‌రామ్‌, డా.బి.ఆర్‌.అంబేద్కర్‌ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సూరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పలువురు వక్తలు మాట్లాడారు. సమాజ హితం కోసం సర్వ సుఖాలను త్యాగం చేసిన మహోన్నతుడు గౌతమబుద్ధుడని కొనియాడారు. మానవ వికాసానికి హేతుబద్ధమైన గొప్ప జీవన మార్గాన్ని ఆయన ప్రపంచానికి అందించారని కొనియాడారు. చదువుతోనే పురోగతి సాధ్యమవుతుందని మొదట గుర్తించింది పూలే అని వారు గుర్తు చేశారు. విపత్కర పరిస్థితులను అధిగమించి ఉన్నతికేగిన రత్నాలలో బాబు జగ్జీవన్‌రామ్‌ ఒకరు అని కొనియాడారు. అంబేద్కర్‌ కలలుగన్న భారతదేశంలో భిన్నత్వంతో కూడిన ప్రత్యేక ప్రజాస్వామిక లక్షణాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌, ఉపసర్పంచ్‌ కేతిరెడ్డి జితేందర్‌రెడ్డి, బండారు సైదులు, పోడేటి చంద్రయ్య, బచ్చలకూరి జార్జి, అంజయ్య, ఎం.వెంకయ్య, మనోజ్‌కుమార్‌, రమేష్‌, జాన్‌విల్సన్‌, ఏ.రాజు, ఎల్‌.శ్రీనివాస్‌, నెమ్మాది శ్రీనివాసరావు,ఏపూరి రాజు, ఆజంజేయులు పాల్గొన్నారు.